క్లుప్తంగా

'చిక్కా'కు ఎమ్మెల్యే అభినందన



చిక్కా సత్యనారాయణను అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమితులైన చిక్కా సత్యనారాయణను ఎమ్మెల్యే నాగిరెడ్డి అభినందించారు. చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి నుంచి సత్యనారాయణ ఆదివారం నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం, ఎమ్మెల్యే నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత కార్మికులు, వారి కుటుంబాలకు అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలికి గాయాలు

పెదగంట్యాడ: చీరకు నిప్పంటుకుని, ఓ వృద్ధురాలికి గాయాలైన ఘటన న్యూ పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 64వ వార్డు పరిధి గంగవరం గ్రామంలో యెరిపిల్లి యర్రమ్మ (70) నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం ఇంట్లో పూజ చేస్తూ దీపం పెట్టారు. ఆ దీపం ఆమె చీరకు అంటుకుని, ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో వెంటనే ఆమె ఇంట్లో నుంచి బయటికి పరుగులు తీశారు. గమనించిన స్థానికులు మంటలార్పి, కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నారు. న్యూపోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాకాహార సద్భావన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు

గాజువాక: పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ సభ్యులు చినగంట్యాడ పరిసర ప్రాంతాల్లో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. సొసైటీ ప్రతినిధి ఎం.శివ గణేశ్వరరావు ఈ ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మర్షి పత్రీజీ ఆశయం మేరకు శాకాహార జగత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ర్యాలీలో శాకాహార ప్రాధాన్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధులు టి.రేవతి, సి.జగదీశ్వరి, పీఎస్ఎన్ మూర్తి, జి.పద్మావతి, బి.అప్పారావు, భాగ్య, రామకృష్ణ, శివాజీ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



కల్యాణోత్సవంలో తలంబ్రాల ఘట్టం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించి విశేషంగా హారతులు ఇచ్చారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు కల్యాణం జరిపించారు.

ఆర్పీఎఫ్ కార్యాలయం సిద్ధం

- భవన నిర్మాణ పనులు పూర్తి
- త్వరలో అందుబాటులోకి..



కొత్తగా నిర్మించిన ఆర్పీఎఫ్ భవనం

అగనంపూడి: దువ్వాడ రైల్వే ప్రయాణికులకు ఆర్పీఎఫ్ కార్యాలయం మరింత చేరువలో, అందుబాటులోకి రానుంది. ప్రస్తుత కార్యాలయం ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం చివరి భాగంలో సిగ్నలింగ్ వ్యవస్థ భవనం పక్కన, దూరంగా లోతట్టు ప్రాంతంలో ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. అసలు కార్యాలయం ఇక్కడ ఉన్నట్టు కూడా ప్రయాణికులకు తెలియని పరిస్థితి. ఒక వేళ తెలిసినా.. సుమారు ఏడు అడుగుల లోతులో దూరంగా ఉన్న కార్యాలయానికి వెళ్లలేక ఫిర్యాదు ఇవ్వడానికి కూడా ఇబ్బంది పడేవారు. దీంతో ఈ సమస్యను దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రయాణికులు, ప్రజాసంఘాల నాయకులు పలుమార్లు రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అంతేకాకుండా ప్రస్తుతం సిబ్బంది ఉంటున్న భవనం కూడా పాతదై, శిథిలావస్థకు చేరుకుంది. వీటిని పరిగణనలోకి తీసుకున్న అధికారులు ఎనిమిది మాసాల క్రితం కోటి రూపాయలతో నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం ముఖ ద్వారం పక్కనే కొత్తగా కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. భవన నిర్మాణ పనులు పూర్తి కావడంతో త్వరలో కార్యకలాపాలు సాగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యాలయం అందుబాటులోకి వస్తే సిబ్బందికి కూడా అనువుగా ఉంటుందని, రైళ్ల రాకపోకల సమయంలో అందుబాటులో ఉంటూ ప్రయాణికులకు భద్రతపై సూచనలు ఇచ్చేందుకు వీలుంటుందని ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్యారెక్స్ కూడా త్వరలో అందుబాటులోకి...

కార్యాలయంతో పాటు సిబ్బందికి మెస్, ఉండేందుకు వీలుగా ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వైపు ఎస్‌టీపీసీ ట్రాక్ పక్కన బ్యారెక్స్ నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయి. బ్యారెక్స్ అందుబాటులోకి వస్తే సిబ్బంది మూడు షిఫ్టుల్లో, పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ఐకమత్యంగా ఉంటూ, సమష్టిగా కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 69వ వార్డు పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అంతా ఒక్కటై అభివృద్ధి సాధిస్తున్నామని చెప్పారు. చిన్న చిన్న సమస్యలుంటే వెంట వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను వెంకటేశ్వర కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, అసోసియేషన్ ప్రతినిధులు వీర్రాజు, పార్వతీశ్వరరావు, నాయుడు, రాజారావు, యర్రాజీ పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు

విశ్వేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న విశ్వేశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం: సమాజ సేవా కార్యక్రమాలు చేస్తూ గుర్తింపు పొందుతున్న జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలేనికి చెందిన శీరంశెట్టి విశ్వేశ్వరరావుకు తమిళనాడు చిత్రదుర్గ జిల్లాలోని హోసూరుకు చెందిన ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను అందించింది. ఈ మేరకు హోసూరులోని యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వేశ్వరావును సత్కరించింది. కార్యక్రమంలో పాల్గొన్న బనజగ సమాజం అధ్యక్షుడు బి.ఆర్.బసవరాజు డాక్టరేట్ అందించారు. ఆయన మాట్లాడుతూ రోటరీ ఫౌండేషన్, శ్రీమణికంఠ జ్యోతిభక్త సేవా సంఘం ద్వారా షీలానగర్‌లోని అయ్యప్ప దేవాలయంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీకి చెందిన పలువురు పాల్గొన్నారు.

టైలర్లను ఆదుకున్న ఘనత సీఎం జగన్‌దే..



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సత్యనారాయణ

అక్కిరెడ్డిపాలెం: టైలర్ల సంక్షేమం గురించి ఆలోచించింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఉత్తరాంధ్ర టైలర్స్ ఐక్యవేదిక వ్యవస్థాపకుడు అతికినశెట్టి సత్యనారాయణ అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం టైలర్లను పట్టించుకోలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత టైలర్లకు ఏటా రూ.10వేలు ఇచ్చి ఆదుకుంటున్నారని అన్నారు. శ్రీవినాయక దుర్గా టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీహెచ్‌పీవీ వద్ద ఆదివారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టైలర్ల కోసం ఏ ప్రభుత్వమూ గతంలో ఎటువంటి సంక్షేమ పథకాలను అమలు చేయలేదన్నారు. అలాగే ఏటా విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా రెండు జతల యూనిఫాం అందజేస్తోందని, అయితే వాటిని స్థానికంగా ఉండే టైలర్లతో కుట్టించేందుకు ఆదేశాలు ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కూనూరు మల్లికేశ్వరరావు, తెలగారెడ్డి పుల్లయ్యనాయుడు, సీహెచ్ త్రినాథ్, దొడ్డి శ్రీను, కె.శ్రీనివాస్, బొడ్డు సాంబశివరావు, సత్యనారాయణ, శ్రీదేవి, ప్రకాష్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

అక్కిరెడ్డిపాలెం: అగ్ని ప్రమాద బాధితులను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం పరామర్శించారు. జీవీఎంసీ 69వ వార్డు పరిధి నాతయ్యపాలెంలో గల సీఎస్సార్ కల్యాణమండపం వెనుక నివసిస్తున్న గంధల శ్రీనివాసరావు ఇంట్లో వంట చేస్తుండగా, గ్యాస్ లీక్ అవడంతో అగ్నిప్రమాదం సంభవించింది. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. విషయం తెలియడంతో, బాధితులను ఎమ్మెల్యే నాగిరెడ్డి, వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు పరామర్శించారు.

భక్తిభావానికి ప్రతీక త్యాగరాజ కృతులు



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న నారాయణ బృందం

ఉక్కునగరం: భారతీయ శాస్త్రీయ సంగీతానికి తలమానికంగా నిలిచే త్యాగరాజ కృతులు.. నిజమైన భక్తి భావనకు ప్రతీకగా నిలుస్తాయని ఉక్కు జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, మార్కెటింగ్ సీజీఎం ఎం. సత్యనారాయణ అన్నారు. స్టీల్‌క్లబ్, విస్కా సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కునగరం స్టీల్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సద్గురు త్యాగరాజ ఆరాధనోత్సవం -2023 కార్యక్రమంలో వారు మాట్లాడారు. విస్కా అధ్యక్షుడు నేమాని శ్రీనివాస శర్మ, కార్యదర్శి ఎ.కేశవరావు మాట్లాడుతూ సంప్రదాయ బద్ధమైన చక్కని కార్యక్రమాలను ప్రేక్షకులకు అందించడంలో విస్కా ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు, ఆకాశవాణి ఏ గ్రేడ్ కళాకారుడు బి.ఎ. నారాయణ బృందంచే నిర్వహించిన పంచరత్న సేవ, త్యాగరాజ విరచిత కృతుల నాద నీరాజనం కార్యక్రమాలు శ్రోతలను భక్తిరస సముద్రంలో ఓలలాడించాయి. కార్యక్రమంలో విస్కా, స్టీల్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో కార్మికులకు అన్యాయం



దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కార్మికులకు నష్టం కలిగించే ఈ నిర్ణయాలపై కేంద్రం పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 745వ రోజు, ఆదివారం సంస్థకు చెందిన కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఇస్తే కార్మికుల భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. కార్మిక చట్టాలను విస్మరించి కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రజల ఆగ్రహంగా ఉన్నారన్నారు. ప్రజా శ్రేయస్సు కోరి ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని ప్రోత్సహించడమే లక్ష్యం

- ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా
- ఉత్సాహంగా ఆనంద మేళా



ఆనంద మేళాను ప్రారంభించిన ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ: భారతీయ వారసత్వం, సంస్కృతిని ప్రోత్సహించడమే ఆనంద మేళా లక్ష్యమని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ, దీపిక లేడీస్ క్లబ్ సంయుక్తంగా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లోని సాధన క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఆనంద మేళాను సిన్హా ప్రారంభించారు. దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా ఆహూతులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మెరిటోరియస్ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. మేళాలో భాగంగా భారతీయ వంటకాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్య రూపాలు, సాంప్రదాయ కళలను ప్రదర్శించి ఆహూతుల మన్ననలు పొందారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, దీపిక లేడీస్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకుందాం

సీతమ్మధార: ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకోవాలని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక దండి పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపడుతున్న నిరాహార దీక్షలు 675వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుతో ఇప్పటి వరకు లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి లభించిందన్నారు. కరోనా కష్టకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు తమవంతు పాత్రను పోషించి ప్రజలకు భరోసాగా నిలిచాయని గుర్తు చేశారు. కార్పొరేటీకరణ విధానాలు అమలు చేసిన ఏ దేశం కూడా అభివృద్ధి సాధించలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని సూచించారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా క్రమబద్ధీకరణ



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

గాజువాక: ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి క్రమబద్ధీకరణ జీవోను తీసుకొచ్చారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవో నంబర్ 71పై హర్షం వ్యక్తం చేస్తూ 67వ వార్డులో ముఖ్యమంత్రి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా సాగుతున్న ఈ సమస్యతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జీవో నంబర్ 44 ద్వారా గాజువాక భూములను క్రమబద్ధీకరించి, రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి అవకాశం కల్పించారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జీవో నంబర్ 301ని తీసుకొచ్చి రిజిస్ట్రేషన్లను నిలిపివేశారన్నారు. ఈ నేపథ్యంలో గాజువాక ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి వివరించామని, తమ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన సీఎం కొత్త జీవో తీసుకొచ్చారని చెప్పారు. పూర్తిస్థాయిలో ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేసుకొనే విధంగా జీవో నంబర్ 71ను రూపొందించారన్నారు. ఈ జీవోతో గాజువాక హౌస్ కమిటీ సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, వైఎస్సార్‌సీపీ నాయకులు మార్టుపూడి పరదేశి, ఎస్.ఎం.డి.గౌస్, పల్లా పెంటారావు, అచ్చియ్యనాయుడు, రాజేష్, వెంకటేష్, సాహిద్, బీమరాజు, అన్నపూర్ణ, లక్ష్మి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఆపద వేళ రక్తమే సంజీవని



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సురేంద్రబాబు



రక్తదానం చేస్తున్న యువకులు

అగనంపూడి: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రమాదకర పరిస్థితిలో ఉన్న రోగికి మీరు దానం చేసిన రక్తమే సంజీవనిలా కాపాడుతుందని రాష్ట్ర దేవాంగుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్రబాబు అన్నారు. ఆపదలో ఆదుకునే రక్తదాతలు ఆపద్బాంధవులని కొనియాడారు. జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలోని ఉక్కు ఆస్పత్రి రోడ్డులో ముత్యాల హారం ఫౌండేషన్ చైర్మన్ బత్తుల కాళిదాస్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. రక్తదానంపై అపోహలు వీడాలని, ఆరోగ్యవంతులైన అందరూ రక్తదానం చేయాలని కోరారు. ముత్యాలహారం ఫౌండేషన్ చైర్మన్ కాళిదాసు తన తల్లిపేరుతో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమన్నారు. రోటరీ బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ వీర మణికంఠ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు రక్తం చాలా అవసరమవుతోందని, అటువంటి సందర్భాల్లో తమ ట్రస్ట్ సహకారం అందిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా దాతల నుంచి 40 యూనిట్ల రక్తం సేకరించారు. వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ధర్మాల శ్రీనివాస్‌రెడ్డి, విందుల పైడినాయుడు, బలిరెడ్డి సత్యనారాయణ, బొబ్బరి సూర్యనారాయణ, మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన

గాజువాక/పెదగంట్యాడ: ఏఎన్నార్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో 74వ వార్డు నెహ్రూనగర్‌లో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన, వైద్య పరీక్షల శిబిరానికి స్పందన లభించింది. శిబిరంలో 108 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. విశాఖ ఎయిర్‌పోర్ట్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ రక్తదానం ఎంతో అవసరమని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఏ ఒక్కరూ రక్తం లభించలేదనే కారణంతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రాకూడదని అన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలకు సర్టిఫికెట్‌లు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అమ్మ బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధి వినోద్ బాలు, మాజీ కౌన్సిలర్ పేర్ల సత్యారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామి దేవాలయం

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1లోని కొండపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 28న మంగళవారం ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 7 గంటలకు శ్రీవారి కల్యాణం జరిపించనున్నారు. మార్చి 1న బుధవారం ఉదయం 9 గంటలకు వైదిక సదస్యం, సాయంత్రం 7 గంటలకు పండిత సదస్యం జరగనుంది. మార్చి 2, 3 తేదీల్లో ఉదయం 9 గంటలకు నిత్య హోమం, సాయంత్రం 7 గంటలకు లక్ష తులసి పూజ నిర్వహించనున్నారు. 04న శనివారం ఉదయం 8 గంటలకు ధ్వజ అవరోహణం, నవకలశ స్నపనం, సాయంత్రం 7 గంటలకు పుష్పయాగం, ఉయ్యాల సేవ, రుత్విక్‌ల సన్మానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఆకట్టుకున్న కోలాటం పోటీలు



ఉత్సాహంగా సాగుతున్న కోలాటం పోటీలు

నక్కపల్లి/సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెంలో కొలువైన పరదేశిమాంబ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కోలాటం పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మండల పార్టీ కన్వీనర్ కర్రిబాబు ప్రారంభించారు. పోటీల్లో 17 కోలాటం జట్లు పాల్గొన్నట్టు నిర్వాహకుడు బోకం శ్రీనివాస్ తెలిపారు. అలాగే సోమవారం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తవ్వవానిపాలెం సర్పంచ్ బోకం స్వామినాయుడు, మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, బోకం శ్రీనివాస్, మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ బోకం కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



అశోకనగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు



87వ వార్డులో ఓటర్లకు కరపత్రాలను అందిస్తున్న కోమటి శ్రీనివాసరావు

పెదగంట్యాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. జీవీఎంసీ 64వ వార్డు పరిధి గంగవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పట్టభద్రులను స్వయంగా కలిసి, కరపత్రాలను అందజేశారు. సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చోడిపిల్లి కోటేశ్వరరావు, ఎర్రబిల్లి సత్తిబాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

- 65వ వార్డు అశోక్‌నగర్‌లో సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారం చేశారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లోకనాథరావు, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, ధనుంజయ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

బీజేపీ మద్దతు అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌ను గెలిపించాలని కోరుతూ గాజువాకలోని పలుప్రాంతాల్లో ఆ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ నరసింగరావు, ల్లా ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు తదితరులు ప్రచారం చేశారు. పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి కోడూరు లక్ష్మీ నారాయణ, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలా కిషోర్ నేతృత్వంలో జీవీఎంసీ 65, 69, 86 వార్డుల్లోని వడ్లపూడి, గంగవరం, షీలానగర్ తదితర ప్రాంతాల్లో పట్టభద్రులను కలిసి, ఓటు అభ్యర్థించారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని కణితి ఆర్‌హెచ్ కాలనీ, యాదవ వీధి, అప్పికొండ, వెలమ వీధి, శెట్టిబలిజ వీధి, సిద్దార్థ నగర్ తదితర ప్రాంతాల్లో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన అభ్యర్థి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వడ్లపూడి ఈశ్వరరావు, శీరం పాపారావు, కోనేటి పారిపల్లి, కోమటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ మద్దతు అభ్యర్థి మాధవ్ తదితరులు

గాజువాక: జీవీఎంసీ 72వ వార్డు చినగంట్యాడ వుడా కాలనీలో బీజేపీ ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని ఆ పార్టీ మద్దతు అభ్యర్థి పీవీఎన్ మాధవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ గాజువాకలో మూడు కార్యాలయాలున్నాయని, వాటిద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఓటరును కలుసుకోవాలని కోరారు. రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల కిశోర్ మాట్లాడుతూ పీవీఎన్ మాధవ్ విజయం సాధించే దిశగా కార్యకర్తలు ప్రచారం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కో-ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, ఎన్నికల ఇన్‌చార్జి కోడూరు లక్ష్మీ నారాయణ, నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, సిరసపల్లి నూకరాజు, సోమశేఖర్, శ్రీనివాసరావు, శశిధరణ్ పిళ్లై తదితరులు పాల్గొన్నారు.